# ★ దేవీపూజ

శ్రీ "గంటి రామ్"

ఆలయం వెనుకప్రక్క చప్టామీద కూర్చున్నాను పవిత్రభావాలను రేకెత్తించే కంఠస్వరంలో లలితా సహస్రనామపఠనము ఒక ప్రక్క, కోరస్‌లో భజన మరొకప్రక్కాను ఎదురుగా పేరుతెలియని మొక్కలూ, చెట్లూ ప్రియురాలి ముద్దులాగ మనస్సును తిమ్మిరెక్కిస్తున్న అనాఘ్రాతనైట్‌క్వీన్ పుష్పాల చల్లని సువాసనలూ చీకూ చింతాలేని పిల్లల జీవితంలాగ గలగల ప్రవహిస్తున్న నదీ చుట్టూ చక్కటి తేనె వెన్నెలలా మనస్సులోని కష్టాలనూ, భయాలనూ మరిపిస్తూ హాయినిస్తున్న నిశ్శబ్దం

దేవీదర్శనం చేసినందుకు ఫలితంగా వరముగా నాకోసం నిర్మించిన దివ్యరూపసందర్శనం కాబోలు యీదృశ్యం అని అనుకున్నాను

కమలా సరోజా యేవో పూజలుచేయిస్తున్నారు నేను వాళ్ళకు కనబడకుండా, చెప్పకుండా వచ్చేసాను నన్నొకమారు వెతుక్కుంటారు కనబడకపోతే చెప్పకుండా వెళ్ళిపోయాననుకుంటారు. లేదా మరేమైనా అనుకుంటారు- ఏమనుకున్నా నాకేమిటి? రేపు మళ్ళీవాళ్ళకు కనబడనుకదా—?

ఆదీకాక నేనేమైనా వాళ్ళను దేవిపూజలు చూడటానికి రమ్మని పిలచుకొనివచ్చానా?

లోపలనుంచి గంభీరస్వరంలో—

"చిదగ్నికుండ సంభూతాయనమః ఓం!" అని

నేను యిక్కడికివచ్చి అరగంట కావచ్చింది. నన్ను వెతుక్కొని నేను కనబడకపోవటంచేత వాళ్లు వెళ్ళిపోయివుంటారు

వాచీ చూశాను. [నల్లబెల్టు జాలిగా చూస్తుంటే "సెకెండస్" అకారణంగా పిచ్చిగా గడగడలాడుతున్నారి. పదకొండుంపావు అయింది ..

పోనీ మరో అరగంట కూర్చుంటే——? ఆ దృశ్యశోభలో తెల్లవారేవరకూ కూర్చోవాలనే ఉంది కాని చల్లగాలి వేస్తున్నాది నా "అస్తమా" ప్రకాశించి దగ్గువస్తే కోరి ఎక్స్‌పోజ్ అయినందుకు మందు యివ్వనంటాడు డాక్టర్.

లేదామని అనుకుంటూ ఆ దృశ్యాన్ని మరొకసారి కలయజూసేను. నల్లమేఘం చాటునుంచి చందమామ బైటకు వచ్చాడు అందుచేత అంతవరకూ గుడ్డిగా పీడగా ఉన్న వెన్నెల ఒక్కసారిగా కాంతివంతం అయింది.

పక్కనుంచి "ఇంటికివెళ్లిపోదామా మేష్టారూ" అని సరోజ స్వరం వినబడ్డాది.

తృళ్లిపడి అటువైపు తిరిగిచూశాను.

కమలా, సరోజా ఆప్రక్క నిలబడి వెన్నెల లతచేత నవ్వుపువ్వులను పూయిస్తున్నారు. సరోజ చాలా సహజంగా అమాయకంగా నవ్వుతూన్నది. ఆమె భుజాలమీద చేయి వేసుకొని కొద్దిగా ముందుకువంగి కమల నవ్వుతున్నా ఆమె నాప్రక్క పరీక్షగా చూస్తున్న చూపులలో ఏదో విచారం, భయం నునుకోపం ఉన్నట్టున్నాయి హాయిగా పువ్వులు పుష్పించినట్టుగా, రేరాణి పువ్వులవాసనలాగ చిన్నపిల్లల కేరింతలను జ్ఞాపకం చేస్తున్నట్టుగా లేదు ఆనవ్వు.

ఇక్కడకుకూడా నన్ను వెతుక్కుంటూ వచ్చివేసారే! నేనిక్కడకు వచ్చినట్లు ఎట్లుతెలిసో!

"చక్కగా ఉందికదా అని ఇక్కడికి వచ్చి కూర్చున్నాను" అన్నాను, క్షమార్పణ స్వరంలో.

కమల నాప్రక్క అదోమాదిరిచూస్తూ "సరోజ అట్లాగే చెప్పింది" అంది,

"నాకిక్కడ హాయిగా ఉందన్నసంగతి సరోజకెట్లుతెలుసు?" అని అనుకుంటూ నాప్రక్కవే

రాతి గప్పామీద కూర్చున్న ఆపిల్ల ప్రక్కపరాకుగా చూశాను.

కమల నా భావం గ్రహించినట్టుగా అంది— 'మీరు ఇట్లావచ్చారని చెప్పింది. .'

ఒక్కక్షణం ఆగి క్షమార్పణ స్వరంతో అంది 'పూజ ఆలస్యం అయిపోయింది'

అర్థంలేని నవ్వుతో అన్నాను "అబ్బే ఆలస్యం ఏమీ అవలేదు లేండి"

"ఎంత తొందరచేసినా ఆలస్యం అయింది" అని అన్నాది నా ప్రక్క తమాషాగా చూస్తూ.

కమల మెల్లగా ఆ ప్రక్క మెట్లు మీంచిదిగి ఏదో పేరులేని చెట్టునీ ఎండిపోయిన మల్లెపాదనీ చుట్టివచ్చి నాకు ఎదురుగా నిలబడ్డాది. ఒకటిరెండు క్షణాలు బహుశః సంశయిస్తూ కాబోలు నా ప్రక్క చూసి ఆ క్రిందిమెట్టు మీద కూర్చొని, ఆ పేరులేని లత ప్రక్కనే ఉన్న ఎండిపోతున్న మల్లెచెట్టు ఆకులను తెంపి పరీక్షగా చూసి ఒక్కొక్క ఆకునీ ముక్కలుగా చేస్తూ "పాపం పూత పట్టకుండానే ఎండిపోతున్నాది" అని మెల్లిగా అంది.

మరుక్షణంలో ఆ మాటలలో ఏదో అర్థం స్ఫురించింది కాబోలు చెక్కులు ఎర్రబడ్డాయి, నా ప్రక్క సిగ్గుతో చూసి తలవంచుకుంది

నేను ఆమె సిగ్గును చూడనట్టే మెల్లిగా అన్నాను "తాపీగా పుష్పిస్తుంది" అని.

ప్రక్క చప్టామీద పడుకొని చందమామ మీద నుంచి వెళ్తున్న మేఘాల స్వరూపభేదాలనూ సంఖ్యనూ నిర్ణయించడానికి కాబోలు ప్రయత్నిస్తున్నాది సరోజ. అదాలిక కళ్లలో నిద్ర ప్రవహిస్తున్నాది

"పదకొండు గంటలై యుండదూ?" అంది కమల సాభిప్రాయంగా

నా వాచి చూసుకొంటూ 'పావు తక్కువ' అన్నాను.

ఆమెవైపు చూస్తుంటె ఆమెలోని లాలిత్యం, ఆమె కళ్ళలోని సొగసూ ఆమె శరీరంలోని ప్రతి అణువులోనూ తొణికిసలాడుతూ ప్రవహిస్తున్న యవ్వన ఛాయలూ, ఏదో వింతశక్తితో నన్ను ఆహ్వానిస్తూ నామీదకి ఉరికి నన్ను నా మనస్సునూ వీలైతే నా ఆత్మనీ ఆక్రమించుకోవాలని చూస్తున్నట్టున్నాయి.

దూరంగా ఉన్న తెల్లమబ్బుల ప్రక్కా అనిర్ణీత స్వరూపంలో ఉన్న కొండల ప్రక్కా దృష్టులను తిప్పుకున్నాను

ఆమెవైపు నేను చూడకపోయినా ఆమె నన్ను పరీక్షగా చూస్తున్నాదన్న సంగతి నాకు తెలుసు

ఆ నిశ్శబ్దం భరించ శక్యంకాకుండా ఉంది. ఆ నిశ్శబ్దంలో ఆమె—లేక, ఆమె ఆత్మ కాబోలు— నాతో నా మనస్సుతో మాట్లాడుతూ నాలోని సంగతులన్నీ రహస్యాలన్నీ తెలుసుకుంటున్నాది.

'సరోజ నిద్రపోతున్నాది' అన్నాను—

'అవునండీ చిన్నపిల్ల నిద్ర ఆపలేదు—'

నేను ఆమాట అందుకొని "అదీకాక చిన్నపిల్లల మనస్సులు నిర్మలంగా తేలికగా ఉంటాయి కాదూ! వేగిరంగా నిద్రవచ్చేస్తుంది" అని అన్నాను

ముణుకలమీద మోచేతులను ఆన్చుకొని అరచేతులలో ముఖం ఆన్చి ఆమె ప్రక్క చూస్తున్నాను

ఆమె ఆ మెట్టుమీద—నా పాదాల దగ్గరగా కూర్చొని తలలోని ఎర్ర చంద్రకాంతి పువ్వులను తీసి అరచేతులో వ్రాసుకుంటూ ఎర్రటి చందమామను నిర్మించుకుంటూంటే అనేక జన్మలలో నాతో కలసివుండి నా అన్ని రహస్యాలనూ తెలుసుకున్న దేవకన్యలాగ. తాను తప్పిపోతే వెతికి వెతికి తనను కనుక్కున్న తల్లిప్రక్క కూర్చొని ఆమెను ఏమిటి అడగాలో తెలిక నిశ్శబ్దంగా అమాయకంగా ఆమెవైపు చూస్తూ కూర్చున్న చిన్నపిల్లలాగ... కనబడ్డాది. ఒకటిరెండు నిముషాల తర్వాత కొంచెంగా మందహాసంచేస్తూ మెల్లిగా అంది. "నిజమే మనకు మనస్సులు ఉండటం వల్ల చాలా చిక్కులు ఉన్నాయన్న మాట!"

"కాదూమరి! ఎక్కడ యే మనిషికి యిచ్చింది బాధవున్నా మనకే బాధ!" అన్నా.

'అవును నిజమే ఆమాట" అన్నది జాలిగా నవ్వుతూ.

"అన్నిటికన్న గొప్పచిక్కు—ఒక్కొక్కప్పుడు మన మనస్సులతోనూ మనమే దెబ్బలాడవలసి వస్తూంటుంది. ప్రపంచంలో మనస్సూ, హృదయం ఉన్నవాళ్ళకు ఎప్పుడూ పోట్లాట ఉంటుంది—"

'అవును' అని సరోజవైపు చూసింది

ఆమె తలలోని ఎర్ర చంద్రకాంత పువ్వులు దీనంగా నవ్వేయి

"చాలా టైము అయినట్టుంది కాదూ?" అంది సాభిప్రాయంగా.

నేను ఆలోచిస్తున్నాను అనుకోకుండా ఒకసారి యీవిడను నావెనుక రానిచ్చాను. కాని, ఈసారి నాతో ఎందుకు రానివ్వటం?

వాచీచూస్తూ "పదకొండుం పావు అయింది" అన్నాను

ఒకటిరెండు క్షణాలు ఆగి నా నిశ్చయాన్ని సూచించడానికి అనుకోకుండా కొంచెం గట్టిగా అన్నాను "నేను కొంతసేపు యిక్కడె ఉంటాను' అని.

వెంటనే జాలివేసింది ఆమెముఖం ప్రక్కచూస్తున్నాను. నా మాటలకు ఆమెకు కోపంవచ్చిందేమో చూదామని.

కాని ఆమె ముఖం ఎత్తలేదు. రెండుమూడు నిమిషాల అట్లాగే తలవంచుకొని కూర్చుంది—ఆనేలమీద అణుస్వరూపంగా తన జీవితసుమం పడిపోతే వెతుక్కుంటున్న తీక్షణతతో ఆ మట్టి నేలప్రక్క చూస్తున్నది

ఆమె నామాటలను వినలేదు కాబోలు! లేక విననట్టుగా నటిస్తున్నదో?

ఆమె తన అరచెయ్యిని యిప్పి చూసుకుంటుంది. తలమీద ఎర్ర చంద్రకాంత పువ్వులను తీసి తయారుచేసుకున్న చందమామ తెల్లటివెన్నెల్లో తెల్ల అరచేతిమీద లజ్జాభరితమైన యువతి ముఖంలో హృదయంలో తగిలిన దెబ్బలాగ ఎర్రగా మెరుస్తున్నది.

తలయెత్తి నాముఖాన్ని ఒకసారి దీర్ఘంగా భారంగా బహుశః తీక్షణంగా కూడానేమో నా అంతరాత్మను పరిశోధిస్తున్నట్టు చూసింది.

మళ్ళీ తలవంచుకొని అరచేతులోని చందమామనుచూస్తూ ఏదో భారమైన వస్తువను మింగుతున్నట్టు గొంతుక ముడిని కదిపింది. ఆమె కంఠంలోని ముడి నీడలా ఆ వెన్నెట్లో కదిలేయి!

ఆమె ఏమైనా అంటే బాగుండు ననిపించింది. తుదకు ఆమె మెల్లిగా, జాలిగా ప్రశ్నించింది—"కోపంవచ్చిందా?—" అని

నిజమే! కాని ఎట్లాపోల్చిందో?.... అవిలాక అంత అవుట్‌రేజియస్‌గా అడుగుతుం దనుకోలేదు!

"కోపమా? కోపం ఎందుకూ—?" మామూలుగా అనాలని ప్రయత్నిస్తూఅన్నాను కాని నా గొంతుకలోని మార్పు నాకే వినబడుతున్నది.

ఆమె అతిప్రయత్నంమీద దృష్టులను నా ప్రక్కకు త్రిప్పి .. కొద్దిగా సంశయిస్తూ.... "ఇక్కడికి మిమ్మల్ని వెతుక్కుంటూవచ్చానుని" అని అంటున్నది— నేను త్వరగా అనేసాను:

"ఇక్కడ వుంటానని తెలుసును కాబట్టి యిక్కడికి వచ్చారు. అందులో తప్పేమటి ఉన్నాది కోపంరావటానికి?'' అని.

కొన్ని క్షణాలు ఆగింది.... ఒక్క క్షణమాత్రం తన చూపులతో నా చూపులను తేల్చి పట్టి, వెంటనే అరచేతులోని చందమామప్రక్కకు దృష్టితిప్పుకొని మెల్లిగాఅంది—" అదికాదు: మేము—"

ఆమె దీనంగా ఆకాశంలోకి చూసింది. ఆ "మేము" అన్న మాటకు అర్థంకూడా చెప్తుందేమో నని భయపడ్డాను: కాని చెప్పలేదు.

"మేము మీతో వచ్చేమనీ, మళ్ళీ యిప్పుడు వస్తామనీ అంటున్నామనీ—"

నిజం గ్రహించింది కాబట్టి అబద్ధంచెప్పినా లాభంలేదు. జవాబు యేమీచెప్పకుండా ఊరుకున్నాను.

ఎవరో తెలియని యీ అమ్మాయిని కన్విన్స్ చెయ్యాలని నేను ఎందుకుప్రయత్నించాలి? కొన్ని నిముషాలు అయాక నాప్రక్క వింతగా చూస్తూ— "ఇందులో గౌరవహాని ఏమిటఉన్నాది?" అని మెల్లిగా ప్రశ్నించింది. స్వరం మెల్లిగాఉన్నా అందులోని తీక్షణతా తూష్ణీభావం చాలాస్పష్టంగా కనబడుతున్నాయి.

కొన్నిక్షణాలు ఆగి మళ్ళీ అంది—

''సాంఘికంగా హీనస్థితిలోనున్న హరిజనులకు సహాయంచేస్తున్నాము కాదూ?''

స్వరంలోని తీక్షణతను సర్దుకోడానికి కాబోలు ఒక్కక్షణం ఆగింది.

"నైతికంగా హీనస్థితిలో ఉన్నామని అనుకున్నంతమాత్రాన, మేము అంతకంటే నీచం అయిపోయామా?'' అని ప్రశ్నించింది నాముఖాన్ని తీక్షణంగా పరీక్షచేస్తు సూటిగాఅడిగింది యీ ప్రశ్నను: కాని స్వరంమాత్రం అతి మృదువుగా ఉంది.

ఆమె మానసికంగానూ, భౌతికంగానూ అలిసిపోయింది. నావైపు అదోమాదిరిగా చూస్తూ బలం సమకూర్చుకుంటున్నాది.

చల్లగాలివేసింది.

నా "అస్తమా లంగ్'' మాయమైపోతుందేమోనని చెయ్యి ప్రక్కటెముకలమీద పెట్టి అదుముకున్నాను ..

ఆమె అరచేతులోని చందమామతో అంటున్నాది— "గోడకు అటు ప్రక్క మాలాంటివాళ్లు ఎన్నివేలమంది ఉన్నారో! కాని మేము ఉండటానికి కారణం.... సంఘంలోని ప్రతివ్యక్తీని...."

ఆమె ఆ వాక్యం స్వగతంగా అనుకుంటుంటే మనసులోని ధ్వనియొక్క ప్రతిధ్వని బైటకువచ్చినట్టున్నాది .

ఈ అమ్మాయి నా "సానికులం" వ్యాసాలు చదివిందికాబోలు! లేక ఇంగ్లీషులోనున్న మహామహుల గ్రంథాలన్నీ కూలంకషంగా చదివిందో!

ఆమె కిలకిల నవ్వుతూ ప్రవహిస్తున్న ఏటివైపు చూస్తు నవ్వుస్వరంతో అంది "పదివేలమంది చూస్తారని పార్కులో పుష్పాలను పారపోసేస్తారుకూడా!" అని

ఆమె చెప్పవలసిన నాలుగు మాటలూ చెప్పివేసినట్టుగా ముఖం అటుప్రక్క తిప్పుకుంది— ఆమెకళ్లలో నీళ్లు తిరుగుతున్నాయి కాబోలు కాని చదువుకున్న అమ్మాయిలు సాధారణంగా యేడవరు

అయితే యింత చదువుకున్న అమ్మాయికి కూడా సాయం ఎందుకూ? నిజానికి యమధర్మరాజు స్వయంగా వస్తే ఖాతాకాపీ కొట్టి ఆతని జీవితంలోనుంచి పదిఏళ్లు వరంగా తెచ్చుకుంటుంది.

ఈ ప్లాన్‌అంతా నాదగ్గరనుంచి డబ్బు పుచ్చుకోడానికేకాదూ?

నాకు నవ్వువచ్చింది. పాపం యీ అమాయికపుపిల్లకు తెలీదుకాబోలు? దివాలాతీసిన అర్బత్‌నాట్ కంపెనీకి మన జీవితానికి చాలాదగ్గర పోల్చులు ఉన్నాయని!

ఆప్రక్క జేబులోని రూపాయిఅణా పరికేమనకున్నఆస్తి కాదు ఎవరో ఎందుకో ఏవో క్లాస్ పుస్తకాలు కొనమని కాబోలు—అయిదురూపాయల నోటుకూడా మీదజేబులో ఉంది!

ఆమె చెప్పినమాటలు జ్ఞాపకానికి వస్తున్నాయి ఇంతకుముందు ఆ వాక్యాలను పదిసార్లు వ్రాశాను నూరుసార్లు చదివేను నేడు ఆమె తనమనస్సునూ ఉద్వేగాన్నీ విచారాన్ని ఈ వాక్యాలలోని అక్షరాలుగా పోతపోసి వాటికి చైతన్యాన్నీ జీవితాన్ని ఇచ్చి ఉచ్చరిస్తుంటే నాకుకూడా కొత్త అనిపించింది!

నిజమే ఆమె చెప్పినమాటలు! సానికులంలో పుట్టిన వాళ్లకంటే అతినీచంగా అవినీతి కరంగా అనైతికంగా బ్రతుకుతున్నా యింకొకరితో వాళ్ల గోడకు యిటు ప్రక్క జీవిస్తున్నారన్న కారణంగా మనం మాట్లాడినా కలసిమెలసి ఉన్నామన మర్యాదకు భంగం ఉండదుఅనే మనఅందరి నమ్మకమూనూ?

గోడకు అటుప్రక్క నున్నదికదా అని యీ అసామాన్య స్వర్ణాన్ని ఎన్ని హృదయాలు వీక్షించకుండా పనిచేస్తున్నాయి కావు?

రోడ్డుప్రక్కనే ఉంటేకదా అని రోజాపుష్ప సౌందర్య భావాలనుభావాల తల తన్నుకుంటూ ఎంతమంది ముందుకు వెళ్ళిపోవటం లేదు

రోడ్డుప్రక్క పుష్పం! పార్కులో పుష్పం!

అయితే రోడ్డుప్రక్క పుష్పాన్నీ పార్కులో పుష్పాన్నీ పడవేలమంది చూశారు కదా అని అపవిత్రమైపోయాయని అనగలమా!

అవి దైవపూజకు పనికిరావా?

అయితే దేవుడు వాటికియిచ్చిన విలువ మానవుడు యివ్వగలడా!

దిరుప్తైన హృదయంతో కమల ప్రక్క చూశాను ఆమె తన అరచేతులోని చందమామను పరీక్షగా పరిశీలిస్తున్నాది. బహుశః తన మనస్సులోనూ ఆత్మతోనూ కూడా చెప్పకుండా దాచుకున్న రహస్యాలను చందమామతో చూపు మాటలతో చెప్తున్నాది కాబోలు!

నాకుచప్పున ఒక ఆలోచన తట్టింది.

నా జేబులో ఉన్న అయిదురూపాయల నోటు యీ అమ్మాయికి యిచ్చేస్తే నాసహాయం తోడూ అక్కరలేకుండా వెళ్లి పోతుందేమో!

రేపు యే పాపాత్ముడి దగ్గరో యీ అయిదు రూపాయలూ అప్పుచేసి అసలు వాళ్లకు యిచ్చి వేయవచ్చును.

ఆమెతో వెళ్ళి ఆమె నటనఅంతా నిజమే అని నమ్ముతూ తుదకు అయిదురూపాయిలు ఇవ్వ కోవి మర్యాద పోగొట్టుకోవటం కన్నా ముందుగా యిప్పుదే ఆఅయిదు రూపాయిలు యిచ్చి వేసి మర్యాద రక్షించుకోవటం ఉత్తముల లక్షణం.

అసలు—ఉత్తములకు యిట్లాంటి చిక్కులే రావేమో!

మెల్లిగా అన్నాను—'కమలా'

నాస్వరం ఎందుచేతనో చాలా సన్నంగా చాలా బలహీనంగా కుక్కపిల్ల పరిగెత్తలేకపరిగెత్తుతూ అరచినట్టుగా ఉంది.

ఆమె కాటుక కళ్లుమెత్తినా చూపులను ఆపట్టింది.

"నువ్వూ సరోజా బయలుదేరి యింటికి వెళ్ళండి. నేను తాపీగావస్తాను " అన్నాను.

ఈవిడతో అన్ని సంగతులు చెప్పడం ఎందుకూ?

"ఇది నీదగ్గర ఉంచు"

మడిచివున్న అయిదురూపాయిల నోటును జేబులోంచి తీసి ఆమెకు అందించాను. ఆమె దానిని అందుకోవి యేమిటా అనినట్టోలు మడత విప్పి చూసింది

తన శరీరం ఆత్మా దానిని తాకుటవలన అపవిత్రమై పోతాయన్నట్టు ఆమె రెండువేళ్ళ కొన గోళ్ళతో ఆ కోటును పట్టుకొని ఏదో తుచ్ఛమైన మహాహీనమైన వస్తువును చూసినట్టుగా చూస్తున్నాది

ఆమె నిశ్శబ్దంగా తలయెత్తి ఒకసారి తీక్షంగా నాముఖం చూసింది.

తన పేక నొక్కడానికి కన్నతల్లి వస్తుంటే పిల్ల అట్లాగే చూస్తుంది—అమానుషమైన దారవర్ణనాతీతమైన పేరులేని భావాలూ ఎవరిలోనూ ఎన్నడూ ఏపరిస్థితులలోనూ చూడని ఉద్వేగాలూ ఆ దృష్టులలో ప్రవహిస్తున్నాయి.

ఆమె ఒక్కక్షణంమాత్రమే బహుశ అంతకంటె తక్కువకాలమేమేమో— నావైపు అట్లా చూసింది. తర్వాత తలవంచి ఆ కోటును పరీక్షించింది.

అమె మనస్సులో ఆ క్షణాలలో ప్రవహిస్తున్న భావపరంపరను చెప్పినవారికి నా జీవితంలోని సగంభాగం ఆ జేబులో మిగిలిపోయిన రూపాయి అణా పరక దక్షిణగా పెట్టి యిస్తాను!

నేను చాలా మోటుమనిషినని అనుకుంటున్నాది కాబోలు ఆఅమ్మాయి.

ఆ నోటు అట్లుయివ్వటం పొరపాటేకాబోలు లేదా అట్లా యివ్వరుకాబోలు।

ఏమో నాకుఅనుభవం లేకపోవటంచేత చాలా గొప్పచిక్కు వచ్చింది!

ఒకటి రెండు క్షణాలతర్వాత మెల్లిగా అంది-

కొత్తనోటే—!"

ఆమె స్వరంలో తృణీకారం ఎంతగా ధ్వనిస్తున్నాది।

ఆమె మెల్లిగా నా ప్రక్క చూడకుండానే ప్రశ్నించింది. "ఎవరిది యీ నోటు?"

గాలి కొంచెం గట్టిగావేసింది- ఆ నోటును చాలాలూజ్‌గా పట్టుకుందికాబోలు- లేక పట్టు వదలిపెట్టిందికాబోలు- అది క్రింద మెట్లమీదపడి, కొద్దిగా ముందుకువెళ్ళి ఉండిపోయింది.

కమల నిశ్శబ్దంగాలేచి దూరంగాఉన్న కొండల ప్రక్కచూస్తు నిలబడింది ఆమె తలలోని ఎర్ర చంద్రకాంత పువ్వులు హృదయానికి తగిలిన గాయాలలాగ విప్పారి నాప్రక్క చూస్తున్నాయి

నా మనస్సులో తిమ్మిరిగాఉంది,

గాలికి ఆనోటు మళ్లీ యెగిరి మణిమెట్టుమీద పడి చాలాప్రయాణం చేసానన్నట్టుగా ఒకసారి కదలి నిశ్శబ్దంగాఉంది చక్రవర్తి బొమ్మశిక్ష విధిస్తున్న జడ్జీలాగ నాప్రక్క చూస్తున్నాది.

ఆమె తిరిగి ఆ యెండిపోయిన మల్లెపొదు ప్రక్కనుంచి జాలిగా నడిచి వెళ్ళిపోతూంటే, ఏదో అగోచరశక్తి అజ్ఞలను ఔదలదాల్చి నన్నూ నా జీవితాన్ని నా వంశాన్ని ఆశీర్వదించడానికి యింతవరకూ వీచినగాలీ ప్రసరిస్తున్న వెలుతురూ కాంతీ, వెన్నెలా ఒకతీవితో ఒక అసమాన హుందాతో, యధాస్థానానికి వెళ్ళిపోతూన్నట్టు అనిపించింది,

పార్కులో పుష్పాలన్నీ ఒకేసారి ఏదో మంత్రశక్తివల్ల ముకుళించుకున్నట్టు అయింది

ఆమె పార్కులో పుష్పం.

కాదు రోడ్డుప్రక్క గడ్డిపువ్వు!

ఏదో శక్తి గుద్దుగుద్ది జ్ఞాపకం చేసినట్టు ఒకరిగా "లోయల్" వ్రాసిన ''గడ్డిపువ్వు'' అన్న పద్యంలోని వాక్యాలు జ్ఞాపకంవచ్చాయి. అని కాబోలు అన్నాడు.

ప్రతీ మానవ హృదయాన్నీ అధికతరపు నీత దృష్టితో- పవిత్రదృష్టితో ఎంచటం నువ్వు నాకు నేర్పుతున్నావు" అన్నాడు

ఓహ్! మానవజీవితాన్నంతటినీ తీర్చి దిద్దగల ప్రేమశక్తినిగురించి ఒక మాటలో ఒక్క భావంలో చెప్పగలిగాడు ఆ మహాద్రష్ట!

కాని కనిపెట్టిన షరతు ఒక్కటిమాత్రమే, —మనం జీవితానికి బాకీపడ్డ ప్రేమను చెల్లించి, పసిపాపలకు ఉండే అచంచల అమాయకత్వంతో ప్రతీ వస్తువను వీక్షించాలని అషరతు.

నిజం మన ప్రేమబాకీలను చెల్లించాలి!

ఈ క్షణంలో కమలచెప్పిన ప్రతీమాటలోనూ ఒక కొత్తఅర్థం స్ఫురిస్తున్నాది। ఆ అమ్మాయి తనకు తెలియకుండానే అనేక సంగతులను ఆ గంటలోనూ నేర్పింది.

ఎంత పొరపాటుచేశాను? జీవితంలో దిద్దుకోడానికి వీలులేని తప్పుచేసానన్నమాట।

ఆమెలోని ఏదో శక్తి యింకా అస్థలంలో కూర్చొని నాతో "తప్పుచేశావునాయనా'' అని అంటున్నట్టే మందలిస్తున్నట్టే ఉంది.

దూరంగా మలుపులోంచి కమలస్వరం వినబడ్డాది— "దయచేసి సరోజను పంపించేస్తారా?"

ఆమె స్వరంలో యింకా యేదోబాధ తొణికిసలాడుతున్నాది. పాపం ఆమె మనస్సుని తనకే కనబడకుండా ఓడ్చుతున్న రక్తం ఊడ్చుతున్న విట్టూర్పులూ ఆస్వరంవణుకులో కదలుతున్నాయి

అయినా ఏంచెయ్యగలను?

ఆమెలోని స్త్రీతో "తప్పుచేశాను" అనిచెప్పి క్షమించ ప్రార్థించాలనిఉంది కాని ఎట్లా?

సరోజ మీద మెట్లుమీద తల ఆన్చుకొని. ఒరిగి నిద్రపోతున్నాది. ఆమెను మెల్లిగా తట్టివేశాను. రోజాపుష్పం వికశించినట్లుగా కళ్ళు యిప్పి నన్నుచూసి "అక్కయ్య యేదీ?' అని అడిగింది.

ఆ స్వరంలో ఎంతో అమాయకత్వం వుంది. ఆమె నమ్మకానికి నాకు నవ్వు వచ్చింది

అక్కయ్యదగ్గరకు తీసుకువెళ్తాను రా అని లేచి నిలబడ్డాను ఆమె తేలికగా లేచివచ్చి నా దగ్గర నిలబడి యింతవరకూ కమల కూర్చున్న మెట్లువైపు చూచింది ఆ మెట్టుమీద యింకా అయిదురూపాయలనోటు పడేవుంది.

సరోజ ఒక్కగెంతుతో అక్కడకువెళ్ళి ఆ నోటు చేతితోతీసి పట్టుకొని "నాకు దొరికింది" అంది పెంకెగా.

మరొకక్షణంలోనే జాలిగాఅంది— "పాపం ఎవరు పారవేసుకున్నారో !

"నేనే పారవేసుకున్నాను" అన్నాను నేను.

ఆమె నాప్రక్క ఆశ్చర్యంగాచూసింది. కాని నా స్వరంలోని ఉద్వేగం ఆ అనుభవంలేని చిట్టి మనసునికూడా గ్రహించగల్గింది.

"మీరా—?" అంది కళ్లు పెద్దవిచేసి ఎదురుగానున్న నేను ఎట్లా పారేసుకోగలిగానో ఆమెకు బోధపడలేదు!

"అవును నేనే పారేసుకున్నాను. అయితేనేం మనకే దొరికిందికాదూ?" అన్నాను.

ఆమె నాప్రక్క తమాషాగా చూస్తున్నాది. నేనుచెప్పినసంగతి పొడుపుకథ అనుకుంటున్నాది కాబోలు!

ఆమె చిన్నచెయ్యిని నా చేతులోకి తీసుకొని ముందుకువెళ్ళేను.

"కమలా ఇదుగో మీచెల్లి" అన్నాను.

"థాంక్సు" తడుముకోకుండా.

ఒక క్షణం ఆగి అన్నాను "పోయిన నా అయిదురూపాయలనోటు మీ చెల్లికే దొరికింది."

నటిస్తున్న ఆశ్చర్యంతోఅందిఆమె "హా! అట్లాగా సరోజా—"

ఆమె జోడు ఎర్రపట్టీల ప్రక్క చూస్తూ అన్నాను 'నేనుకూడా మీతో వస్తున్నాను' అని

నాస్వరంలో జంకూ, భయం లేవు

కమల వ్యంగ్యంగా, తమాషాగా నాప్రక్క చూస్తూ "మాకు తోడుగా, సహాయంగా వస్తానంటున్నారా యేమిటి—కొంపతీసి?" అన్నాది.

ఆమెమనస్సు చాలా డిస్పరేట్‌గా ఉందన్న మాట ఆమెచెప్పిన వాక్యంలోని అపహాస్యం, తృణీకారం వెక్కిరింతగ్రహించినట్టుగా నేఅన్నాను "అవును కమలా, మీకు సహాయంగానే వస్తాను కాని ఒక్క షరతు: నేను పారవేసుకున్ననోటును నువ్వు మీచెల్లి దగ్గరనుంచి పుచ్చుకోని నాకోసం జాగ్రత్త పెట్టాలి"

ఆమె యేమీ మాట్లాడకుండా నాముఖం పరీక్షగా చూస్తున్నాది బహుశ నా మనస్సులోని మార్పునూ, లాలిత్యాన్నీ విచారాన్నీ కొలుస్తున్నాది కాబోలు!

"ఏం దాస్తావా?" అని మళ్లీ ప్రశ్నించాను— లాలింపు స్వరంతో.

సరోజ పెంకిగా అంది "అక్కకు యెందుకు యిస్తాను? అది ఎవరిదో వాళ్ళకేయివ్వాలి గాని"

కమల ఆమె భుజంమీద మృదువుగా చెయ్యివేసి ముద్దులొలికింపు స్వరంలో అంది "ఆనోటును నువ్వు నాకు యివ్వకపోతేనూ, నేను పుచ్చుకోని దాచకపోతేనూ మేష్టారు మరి మనకు సాయం రారు."

"మాష్టారు రాకపోతే దారిలో మనకు భయం వెయ్యదూ?" అంది పెంకితనంగా. వేళాకోళం గానూ.

"మనకు భయంవేస్తే మేష్టారికేమీ బాధలేదు" అందికమల ముద్దులొలికింపుగానే

ముందడుగు వేస్తూ నేను వెనుతిరిగి ప్రశ్నించాను. "ఇంటి దగ్గరనుంచి ఎవరినీ రమ్మనారా యేమిటి?"

సరోజ నవ్వుతూ "మిమ్మలిని రమ్మన్నాముకాబట్టే మీరు వచ్చారు ఇంకెవరూ ఎందుకూ?" అంది.

కమల మృదువుగా ఆపిల్ల బుగ్గమీద చిటిక వేసి 'తప్పు' అంది నవ్వుతూ నాప్రక్క చూసింది.

"నయమే నేను సహాయం ఉంటానని బాండు కూడా వ్రాసి యిచ్చేనన్నావు కాదూ" అన్నాను.

"అవును సాయంకాలం మీరు చెప్తేనే మేము బయలుదేరాం" అంది సరోజ.

నాకు బోధపడలేదు 'నేనా' అన్నాను.

"మీ స్టూడెంట్సుతో ఆలయానికి వెళ్తానని చెప్తుంటే సాయంకాలం సరోజ వింటిట" అన్నాది కమల

సరోజ చేతులుతిప్పుతూ తొందర తొందరగా అంది "నేనుగాదు మేష్టారూ అక్కయ్యే విన్నది మీసహాయంతో బయలు దేరతానని కూర్చుంది"

"ఆఁహాఁ" అని కమలప్రక్క చూస్తూ, పెంకెగా అన్నాను "నేనుయిప్పుడుసహాయంరావంటె"

ఆమె ఒక్క క్షణంఆగి ప్రశ్నించింది 'మీరు మృచ్ఛకటికం చదివారా!'

నాప్రక్క సిగ్గూ, లజ్జా, భారంతో ఒకసారి చూసి తిరిగి ప్రక్కనున్న పేరులేని చెట్లలోకి చూసింది. ఆమె ముఖంలో రక్త ప్రవాహం హెచ్చు అయినట్లుగా ఆమె చెక్కులు రోజా రంగుదాల్చేయి.

"—చదివాను—" అంటూ ఒకట రెండు క్షణాలు తీవ్రంగా ఆలోచించాను. కమల సిగ్గుతో వున్న నవ్వు ముఖంప్రక్క చూస్తూ.

"—అయితే—" అన్నాను.

ఆమె నాప్రక్క చూడకుండానే అంది ఏ శకారుడో వెంట బడతాడు, అంతే!

చప్పున తట్టింది మృచ్ఛ కటకంలో వసంత సేన—ఓహో! అదా!

"అల్లా వువ్వుని కోనుకొనివస్తానే అక్కయ్యా అని సరోజ ముందుకు పరిగెట్టింది

నేను కమల దగ్గరగావెళ్ళి ఆమెచెయ్యి పట్టుకున్నాను. తనచేతిని వెనుకకు తీసుకోవాలని ప్రయత్నించ కుండానే "అబ్బ.. సరోజ—" అని అటుప్రక్క చూసింది.

"పేరులేని పువ్వులనుకోనుకుంటున్నానిలే. బాధలేదు" అని ఆమెముఖం చూశాను

ఆమె ఒక్క క్షణమాత్రం నా చూపులను తన చూపులతో అపట్టి ప్రశ్నించింది. "పేరులేని పువ్వులా? .. పార్కులో పుష్పాలా?" అని.

నేను నవ్వుతూ అన్నాను... "ఆమె పేరు లేని పుష్పాలను కోస్తున్నాది— నేను పార్కులో పుష్పాలను కోస్తున్నాను" అని.

నేను ఆమె కళ్ళలోకి చూశాను. ఆమెకళ్ళలో పసిపాపలోని అమాయకత్వం అచంచల విశ్వాసం ప్రవహిస్తున్నాయి.

నేను ఒక్కనిమషం ఆగి చెప్పాను "ఏ పుష్పమైనా దేవీపూజకు పనికివస్తుంది"

ఆమె భుజంమీద చెయ్యివేసి ఆమెను దగ్గరగా తీసుకున్నాను.

లోపలనుండి గంభీరస్వరంలో "ఉన్మేష నిముషోత్పన్న విపన్న భువనావళీ ... సహస్ర శీర్షవదనా సహస్రాక్షీ సహస్రపాత్" అని వినబడుతున్నాది.

దూరాన ఎవరో, నీవురాక, గ్రామఫోన్ వేసికుంటున్నారు. ఎంతచూచినా ఎంతనేర్చినా. ఎంత చదివినా... కొంత దాసులేకదా!" అని త్యాగరాయకృతి వినబడు తున్నాది.

ఆనందవాణి
పోస్టుబాక్సు నెంబరు
1583
—మేనేజరు